# పాప

న్యూస్ పేపర్ చదివినా, టీవీ వార్తలు విన్నా ఏదో కారణం చేత ఆడపిల్లలపై జరిగే అత్యాచారాల, హింస అరికట్ట లేకుండా ఉన్నాము. జన్మ మొదలు అంతిమ దశ వరకు ఏదో రీత్యా ఆడ పుట్టుక వద్దనుకునే వాళ్ళు ఎక్కువయ్యారు. అన్ని కోణాల్లో మనలో మార్పు రావడంలేదు.

వినయమణి మనసేం బాగాలేదు, ఉపశమనం కోసం ఏదో ఒక నిర్వాకం ఉండాలని తన అభిరుచి మేరకు కుంచెకు రంగు అద్ది చిత్రలేఖనం మొదలు పెట్టింది.

'ఆడపిల్ల పుట్టగానే వద్దనుకొని రోడ్డు పక్క చెత్తకుండి వద్ద పసికందు బొమ్మ' పెయింటింగ్ వేసింది. అయినా బిపి తగ్గలేదు.

"అత్తయ్య, ఈ రోజు నేను వంట చేయలేక పోతున్నాను. మధ్యాహ్నం ఆయన భోజనానికి వచ్చి వంట కాలేదంటే అరుస్తాడు. కొంచెం మీరు.. !?" ఇబ్బందిగా చెప్పింది గంగ.

"నేను ఎప్పుడో చెప్పాను.. తొమ్మిది నెలలు నిండాయి, నువ్వు రెస్ట్ తీసుకో అని, నువ్వు వింటేగా? సరే, వంట చేస్తాను, నిన్న రాత్రి భార్గవ్.. అంతలా నీ మీద అరుస్తున్నాడు..?" అడిగింది అత్తగారు వినయమణి.

"ఏదో.. భార్య భర్త అంటే మంచీ-చెడు ఉంటాయిగా.." తప్పించుకోవాలని మాట దాటేసి గంగ డైనింగ్ టేబుల్ పక్కనే ఉన్న కుర్చీలో భారంగా కూర్చుంది. వినయమణి బియ్యం కడిగి, కుక్కర్ పెట్టి స్టౌ వెలిగించింది. పాలకూర శుభ్రం చేసి కూర మరో పక్క వండింది; చింత చిగురు పప్పు చేసింది.

"నా నుండి ఏదో విషయం దాస్తున్నావు? నా కొడుకు సంగతి నాకు బాగా తెలుసు.. నా నుండి దాచి పెట్టాలని ప్రయత్నిస్తే.. నష్టపోయేది నువ్వు.. అర్థమైందా? ఇది వరకు రెండు కాన్పులు మిస్ క్యారేజ్ అయ్యిందా? లేక మీరిద్దరూ కలిసి అబార్షన్ చేయించరా?" నిలదీసింది. గంగ జవాబు ఇవ్వక వంచిన తల ఎత్తలేదు.

"నువ్వు చెప్పక పోయినంత మాత్రాన నాకు తెలియదనుకున్నవా? మీ పరుపు కింద దాచిన నీ అబార్షన్ రిపోర్ట్స్ చూశాను. మీ ఇద్దరి మీద నమ్మకం లేదు. అందుకే.. నా బాధ దాచుకోలేక, ఎవరితో పంచుకోలేక.. ఇదిగో, ఇలా ఏ పాపము ఎరుగని, ఎవరూ దిక్కులేక ఏడుస్తూ ఉన్న ఆడశిశువు.. పుట్టుక తోనే అనాథ! బొమ్మ గీశాను." అత్తగారు వేసిన పెయింటింగ్ చూసి ఒక్కసారిగా దుఃఖం కట్టలు తెంచుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్న గంగను ఓదార్చింది వినయమణి.

"మీరు కాక ఇంకా.. నాకు ఎవరున్నారు. మీకు అసలు విషయం చెప్తాను."

"వద్దు, రెస్ట్ తీసుకో. భోజనం చేసి పడుకో. భార్గవ్ వచ్చాక.. వాడి నోట అసలు విషయం వింటాను."

"అమ్మో! వద్దు.. అత్తయ్య, నన్ను చంపేస్తాడు. నేనే చెప్తాను" భయాందోళనలు ఏకమయ్యాయి.

"వాడు మనిషి. దెయ్యం, భూతం అన్నట్టు ఎందుకలా భయపడతావ్?" వినయమణి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది.

"ఎందుకంటే, నా వాళ్లను వదిలి మీ అబ్బాయిని పెళ్లి చేసుకున్నాను. పెద్దగా చదువు లేదు, నా నుండి ఆర్థిక సంపాదన లేదు."

"అయితే!? ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. హాయిగా ఉన్నారనుకునే వేళ.. ఎందుకని కష్టాలు సృష్టించుకుంటారు?"

"ప్లీజ్, నన్ను చెప్పనీయండి.."

<>-<>

"మా పెళ్లి తర్వాత చాలా సార్లు 'కొడుకు' పుట్టాలి అన్నాడు. పాపం ఎన్నో మొక్కులు కూడా మొక్కాడు. ఏ దేవుడు కరుణించలేదు. నా గర్భంలో 'కూతురు' అని తెలిసింది. లింగనిర్ధారణ నేరమని తెలుసు. ఆఫీస్ నుంచి లోన్ తీసుకొని; 'మాతృశ్రీ హోమ్' డాక్టర్ అడిగిన లంచం ఇచ్చి అబార్షన్ చేయించుకున్న. ఆ దేవుడు ఆయన మాట వినిపించుకోలేదు. కానీ, డాక్టర్ చేస్తున్న అప్రాచ్యపు పనులు బట్టబయలు అయ్యాయి, డాక్టర్ అరెస్ట్ అయ్యాడు. ఇతర డాక్టర్లు లింగనిర్ధారణ పరీక్షలకు అంగీకరించలేదు. పైగా నేరమని మందలించారు. ఇక తప్పనిసరి అని ఊరుకున్నాడు. నిన్న రాత్రి గొడవ ఏమిటి అని అడిగారు కదా?.. ఈ సారి మళ్ళీ 'కూతురు' పుడితే హాస్పిటల్ స్టాఫ్ ఆయా, నర్సు ఎవరో ఒకరికి ఎంతో కొంత డబ్బు ఆశ చూపించి పుట్టిన కూతుర్ని ఎక్కడైనా వదిలి పెట్టాలి. ప్రతీ చోట సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి, మనిద్దరం ఈ పని చేస్తే పోలీసులకు చిక్కిపోతాము అన్నాడు. నేను వద్దన్నాను. వినిపించుకోలేదు, నాకు కొడుకు కావాలి, కూతురు వద్దని; మీకు చెప్పొద్దని గట్టి వార్నింగ్ ఇచ్చాడు" చెప్పడం ఆపింది గంగ.

"వాడి సంగతి నేను చూసుకుంటాను. భయపడకు. ముందు నువ్వు అన్నం తిని రెస్ట్ తీసుకో. అసలే నీకు డెలివరీ రోజులు.." బరువుగా నడిచి బెడ్ రూం లోకి వెళ్ళింది గంగ.

<>-<>

భార్గవ్ ఆఫీస్ ఇంటి దగ్గరలో ఉంది. లంచ్ కోసం వచ్చాడు. అమ్మ అన్నం వడ్డించింది.

"అమ్మా, గంగ వంట కంటే నీ చేతి వంట రుచిగా ఉంటుంది, నువ్వు పెద్దదానివయ్యావు. లేకుంటే.." పొగడ్త ఆపేసింది.

"అవునా!? నేను తల్లిని కాబట్టి అంటున్నావు కానీ, ఏమిటో ఎంత బాగా చేసినా 'నలభీమ పాకం' అనే పేరు పడింది కానీ మా ఆడవాళ్లను ఎవ్వరు పొగడరు."

"ఎవరి పొగడ్తలు మనకెందుకు? నా తల్లి.. నాకు గొప్ప! ఇక మీదట నువ్వే వంట చేయి. నీ కీళ్ల నొప్పులకు మంచి డాక్టర్ కి చూపిస్తానమ్మా! బహుశా సర్జరీ అంటే చేయించుకుంటావా?" భార్గవ్ ప్రేమగా అన్నాడు.

“నీకు తెలిసి కీళ్ల నొప్పులు మాత్రమే. నాకు ఇంకా చాలా ఉన్నాయి నొప్పులు, బాధలు ఉన్నాయి! వచ్చే తక్కువ పెన్షన్ ఏ డాక్టర్ ఖర్చులకు సరిపోదు..” నిర్లిప్తంగా అంది తల్లి.

“నేను ఉన్నా కాదమ్మా, ఒక్కొక్కటిగా నీ ఆరోగ్య సమస్య తీర్చుకుందువు గానీ..” భరోసా ఇచ్చాడు.

“వద్దు భార్గవ్! నీకు బరువు పెంచాలనుకోలేదు. నేను ఈ నా ఇల్లు అమ్మి, నా జబ్బులు నయం చేయించుకొని హాయిగా ఉండదల్చుకున్న.”

“అమ్మా, నాన్న బతికి ఉండగా ఉన్న ఇల్లు, నీ బంగారం తన వ్యసనాలకు వృధా చేసి చనిపోయాడు. ఏదో నాన్న ఆఫీస్ లో వచ్చిన నీ ఉద్యోగం.. డబ్బు మిగిల్చి కొనుక్కున్న ఇంత చక్కటి ఫ్లాట్ అమ్మితే నేనెక్కడికి పోవాలి?”

“నువ్వు మగవాడివి.. ఎక్కడైనా, ఎట్లా అయినా బతగ్గలవు. నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు. మీరు మీ దారి చూసుకోండి.”

“అమ్మా! అలా మాట్లాడకు..”

“ఎందుకు మాట్లాడొద్దు? నేను.. అమ్మ.. అనే స్త్రీ! ఒక దాన్ని ఇంట్లో ఉన్నాను.. అనే ధ్యాస లేదు. ఇదిగో.. ఇదేంటి?”

“నీ హియరింగ్ ఏడ్..” బుద్ధిగా జవాబు ఇచ్చాడు కొడుకు.

“ఈ చిన్ని మెషిన్.. నా చెవిలో పెట్టుకుంటే చీమ చిటుక్కుమన్నా వినబడుతుంది. మెయిన్ రోడ్డు మీద వెళ్లే అన్ని హారన్లు నా ఇంట్లో మోగినట్టు వినిపిస్తాయి. ఇదే పెట్టుకుని.. రాత్రి మీ ఆలుమగల సంభాషణ విన్నాను.”

“..........” భార్గవ్ గతుక్కుమన్నాడు.

“అంతే కాదు, మీరు భద్రంగా బెడ్ కింద దాచిన గంగ అబార్షన్ కాగితాలు కూడా చూశాను. నీకు కూతురు వద్దు, కొడుకు కావాలి.. అనే కోరిక ఉంటే అనాథ బాలురు చాలా మంది ఉన్నారు, పెంచుకో.. అంతే కానీ పిచ్చి వేషాలు మానేసేయి.”

“అమ్మా! అమ్మాయిలపై జరిగే అత్యాచారాలు వింటున్నాను, చూస్తున్నాను.. అందుకే..” సంశయిస్తూ అన్నాడు.

“ఏంటి? అందుకా!? ఆఫీస్ పరీక్షలు రాసి ప్రమోషన్ కావాలంటే సరస్వతి అమ్మను కొలుస్తావు. దసరా నవరాత్రులు వస్తే.. దుర్గమ్మ పూజ కోసం అపార్ట్మెంట్ అందరి వద్ద నుండి చందా పోగు చేసి, తొమ్మిది రోజులు ఉపవాస దీక్ష, ఊరేగింపు సంబరాలు దగ్గరుండి జరుపుతావు. డబ్బు కావాలి.. లక్ష్మీ దేవిని పూజిస్తారు. ఎదురింటి భూషణం గారి అమ్మాయి పెళ్లి కాలేదు అంటే గిరిజా కళ్యాణం, రుక్మిణీ  కళ్యాణం జరిపించమని హితబోధ చేశావు..??”

“..........” వంచిన తల ఎత్తలేదు భార్గవ్.

"అమ్మ చేతి వంట ఇష్టం. ప్రేమించిన భార్య కావాలి, ఆమె ఆరోగ్యం అబార్షన్ వల్ల క్షీణించినా ఫరవాలేదు. పక్కింటి పాప ఎదురొస్తే అంతా మంచి జరుగుతుంది అనే నమ్మకం ఉంది. మరి నీకు 'అమ్మాయి' వద్దు..! అబార్షన్!! లేదంటే.. పుట్టిన పసికందును రోడ్డుపాలు చేసి.. ఛీ! ఇంతేనా నీ చదువు.. సంస్కారం?"

"………." భార్గవ్ అన్నం కెలుకుతున్నాడు.

"నాకు ఈ దరిద్రపు విషయం తెలిసినప్పటి నుండి.. ఏదో నా హాబీ కొద్దీ.. ఇదిగో.. ఈ బొమ్మ వేశాను.. చూడు.. నువ్వు చేసే పని.. ఇంత నీచంగా ఉంటుంది!" అమ్మ గీసిన బొమ్మ చూశాడు. అప్పుడే పుట్టిన పసికందు బట్టల్లో చుట్టబెట్టి ఉంది.. నిర్దయగా వదిలి వెళ్తున్న స్త్రీ!! ఎప్పుడూ అందంగా ప్రకృతిని చిత్రించే అమ్మ.. ఈ సారి వేసిన బొమ్మ నచ్చలేదు.

"అమ్మా! బాగా లేదు" ముఖం ఎబ్బెట్టుగా పెట్టాడు.

"ఎందుకు బాగా లేదు.. ఎందుకంటే ఇది ఒక పాషాణం! అవునా? ఇది కేవలం నేను వేసిన స్కెచ్! బాగాలేదు.. ఇదే పని నువ్వు చేయాలనుకునే నాన్సెన్స్!! ఇంకో మాట, బుద్ధిగా విను.. ఈ సారి కూతురు; అంటే నా మనవరాలు పుడితే.. నాకు ఇవ్వండి.. నేను ఒంటరిగా, ప్రేమగా పెంచుకుంటాను. నీలాంటి కుంచిత బుద్ధి రాకుండా జాగ్రత్త పడతాను. ఏమో, నిన్ను సింగిల్ పేరెంట్ గా పెంచినందుకు నీ పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోలేదమో!? మీరు.. మీ ఇష్టం.. ఇక్కడ ఉంటారో.. వేరే వెళతారో.. ఆలోచించుకోండి. ఎందుకంటే, మనుషులకు మాత్రమే అర్థం అయ్యేటట్టు చెప్పగలను.." అన్నం తినలేక అమ్మ వేదన మూలాలు గ్రహిస్తున్నాడు భార్గవ్.

"అమ్మా..! గంగ అరుపు వినిపించింది. బెడ్ రూమ్ వైపు తల్లి కొడుకు పరిగెత్తారు.

"హాస్పిటల్ వెళ్దాం.. నా వల్ల కావడం లేదు" అతి కష్టంగా అంది గంగ. భార్గవ్ ఆఫీస్ రాలేనని, సగం రోజు సెలవు అని ఫోన్ చేశాడు.

<>-<>

"బేబీ గర్ల్" నర్స్ పాపను చూపించింది. ముద్దుగారే పాప! తృప్తిగా ఎత్తుకుంది వినయమణి. నేను ఎంత పుణ్యం చేసుకుంటే నాకు మనవరాలు పుట్టింది. తన చేతి వేళ్ళతో పాపను అతి మెత్తగా స్పృశించి, తన వేళ్ళను తానే ముద్దు పెట్టుకుంది.

"అమ్మా.. పాప పేరు నువ్వే నిర్ణయించు.." అంటూ భార్గవ్ చిన్నారి పాప కాళ్ళ వైపు తల వంచి 'దేవత పుట్టింది' దండం పెట్టుకున్నాడు.

"అలాగే.. మంచి పేరు ఆలోచిస్తాను.." పేరులో ఏముంది పెన్నిధి! పాప దక్కింది చాలు మనసులో అనుకుంది నాయనమ్మ.

++ శుభం++